క్లుప్తంగా

నేడు ప్రజావేదిక

గోపవరం : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఉదయం 9–30 గంటల నుంచి 1–30 గంటల వరకు ప్రజావేదిక (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమం ఉంటుందని మండల తహసీల్దారు ఉదయభారతి తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులందరూ తప్పక హాజరు కావాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

రాజుపాళెం : మండలంలోని గోపాయపల్లె గ్రామానికి మండ్ల చిన్న వీరయ్య అనే వ్యక్తి వద్ద నుంచి 16 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. ఆదివారం గ్రామంలో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారంతో చిన్న వీరయ్యను అదుపులోకి తీసుకుని 16 మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. మండలంలో అక్రమ మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెడ్ల ఐక్యతను చాటుతాం

రాజుపాళెం : రెడ్డి సామాజికవర్గాన్ని ఐక్యం చేసేందుకు కృషి చేస్తున్నామని అఖిల భారత రెడ్ల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ నారుపల్లె జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాజుపాళెంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రేనాటి సూర్యచంద్రులు పుట్టిన గడ్డ ఉయ్యాలవాడ నుంచే రెడ్ల ఐక్యతను చాటుతామని పిలుపునిచ్చారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఉయ్యాలవాడ గ్రామంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, అన్నదాత బుడ్డా వెంగళరెడ్డి ఇల్లు, గ్రామం, వాకిలి కోటలను పరిశీలించామని తెలిపారు. సెప్టెంబర్ 1న ఉయ్యాలవాడలో అఖిల భారత రెడ్ల ఐక్యవేదిక విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని, రాష్ట్రంలోని రెడ్ల సంఘాల ప్రతినిధులు, రెడ్ల కుల బంధువులు రాజకీయాలకతీతంగా ఈ సమావేశంలో పాల్గొనాలని ఆయన కోరారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



ఎస్ఐ హనుమంతు

కాశినాయన : మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని కాశినాయన మండల ఎస్ఐ పి.హనుమంతు తెలిపారు. కాశినాయన మండల ఎస్ఐగా పి.హనుమంతు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. తలమంచిపట్నం ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై కాశినాయన మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

తవ్వారు.. వదిలేశారు



లింగాలదిన్నెపల్లె దగ్గర నూతన బ్రిడ్జి నిర్మాణం కోసం తీసిన గుంత

బ్రహ్మంగారిమఠం: మైదుకూరు– పోరుమామిళ్ల జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రజలకు, వాహనదారులకు శాపంగా మారాయి. ఎద్దు అడుగు కనుమ నుంచి కేశాపురం వరకు బ్రిడ్జిల నిర్మాణం కోసం అధికారులు రోడ్డును తవ్వారు. ఇప్పటివరకు బాగానే ఉన్న సదరు రోడ్డను తవ్వి నెల రోజులు గడుస్తున్నా ఇంతవరకు పనుల్లో పురోగతి కనిపించలేదు. నిత్యం ఆ దారిగుండా రాకపోకలను సాగించే వాహనదారులు, స్థానిక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే లింగాలదిన్నెపల్లె, శ్రీరామనగర్, అమగంపల్లె, కేశాపురం గ్రామాల ప్రజలు రోడ్డు ప్రమాదాలకు గురయ్యారు. ఇప్పటికైనా సంబంధిత కాంట్రాక్టర్, అధికారులు రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సాగర్ కుడి కాలువకు నీరు విడుదల

బ్రహ్మంగారిమఠం: బ్రహ్మంసాగర్ కుడి కాలువకు ఆదివారం 100 క్యూసెక్కులు నీటిని తెలుగుగంగ అధికారులు విడుదల చేశారు. ఏఈఈ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ రైతుల అవసరాల కోసం నీరు విడుదచేయాలని కోరడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో నీరు విడుదల చేశామని తెలిపారు. బ్రహ్మంసాగర్ డెడ్ స్టోరేజీలో ఉందని, త్వరలో నీటిని విడుదల చేస్తారని పేర్కొన్నారు.

నేడు పెద్దగురువళూరులో వైద్య శిబిరం

చాపాడు: మండల పరిధిలోని పెద్దగురువళూరులో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డా.ఓబులేసు తెలిపారు. గ్రామంలో విలేజ్ హెల్త్ క్లీనిక్ వద్ద ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వైద్య శిబిరం నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేస్తామని చెప్పారు. దీర్ఘకాలిక రోగులకు కూడా చికిత్స అందజేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని పెద్దగురువళూరు పంచాయతీ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

వాకింగ్

- నడకతో సంపూర్ణ ఆరోగ్యం
- దీర్ఘకాలిక రోగాలకు చెక్
- వ్యాయామంతో రోజంతా ఫుల్ జోష్

నడక అనేది ఒక సహజమైన చర్య. ఎలాంటి ఖర్చులేని వ్యాయామం. ఎక్కడైనా ఏ సమయంలోనైనా వ్యాయామం చేయవచ్చు. నడక శారీరక సామర్థ్యానికే కాదు, రోగనిరోధకశక్తిని పెంచి రకరకాల జబ్బుల బారినపడకుండా కాపాడుతుంది. గుండె సమర్థంగా పనిచేస్తుంది. గుండెపోటు రాకుండా కాపాడుతుంది. రక్త ప్రసరణ పెరుగుతుంది. రక్తపోటు అదుపులో ఉంటుంది. విటమిన్ డి ని మెరుగుపరుస్తుంది. రక్తంలో గ్లూకోజు స్థాయి తగ్గుతుంది. ఇలా నడక వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయి.



అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో వాకింగ్ చేస్తున్న వాకర్లు

ప్రొద్దుటూరు కల్చరల్ : నడక మానవ శరీరానికి దివ్యమైన ఔషధం లాంటిది. ప్రతిరోజూ గంట నడిస్తే చాలు ఆరోగ్యానికి చాలా మంచిది. ప్రస్తుత కాలంలో ఊబకాయం, గుండెపోటు, మధుమేహం, తదితర వ్యాధుల బారిన పడి అనేక మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిని అదుపులో ఉంచుకునేందుకు నిత్యం అనేక మందులు వాడుతున్నారు. చాలా మంది రోజూ వ్యాయామం చేయక పోవడంతోనే అనేక రోగాల బారిన పడుతున్నారు. ఆరోగ్యకరమైన జీవనం సాగించాలంటే చక్కని వ్యాయామంతో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో నడక ఎంతో మేలు చేస్తుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. పట్టణంలోని అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్, రాజీవ్ పార్కు, ఎస్సీఎన్నార్ డిగ్రీకళాశాల, పాలిటెక్నిక్ మైదానాలతో పాటు గాంధీపార్కు తదితర ప్రాంతాల్లో నడక చేసే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. మైదానాల్లో రోజూ నడక సాగించడం వలన అక్కడికి వచ్చే వారితో స్నేహ బంధం బలపడుతుంది. అందరూ కలిసి ఉదయం గంట పాటు వాకింగ్ చేస్తూ ఆత్మీయ ముచ్చట్లు పెట్టుకుంటామని పలువురు వాకర్స్ పేర్కొన్నారు.

నడకతో ప్రయోజనాలు

- రోజూ 3 నుంచి 5 కిలో మీటర్లు దూరం నడక సాగించడం ఆరోగ్యానికి చాలా మంచిది. దీని వలన రోజంతా ఉత్సాహంగా ఉంటుంది.
- గుండెజబ్బులు, క్యాన్సర్లు, మధుమేహం, బీపీ వచ్చే అవకాశాలు తక్కువ అవుతాయి.
- మానసిక ఒత్తిడి తొలగి మనసు ప్రశాంతంగా ఉండటంతో పాటు జ్ఞాపకశక్తి మెరుగవుతుంది. అలాగే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.
- నడక ద్వారా శరీరంలోని కొవ్వు కరగడంతో పాటు రక్తప్రసరణ సరిగ్గా జరుగుతుంది. కండరాలు, ఎముకలు బలపడుతాయి.
- ఏకాగ్రతతో పాటు మానసిక ప్రశాంతతకు నడక ఎంతగానో దోహద పడుతుంది.

వాకింగ్‌తో ఆరోగ్యం



ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేయడం ఆరోగ్యానికి చాలా మంచిది. ప్రతి రోజు వ్యాయామం, వాకింగ్ చేయడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చు, ముఖ్యంగా బీపీ, షుగర్ అదుపులో ఉండటంతో పాటు ఊబకాయం తగ్గుతుంది. వాకింగ్ ప్రారంభించిన రెండుమూడు వారాల్లోనే మార్పు కనిపించి శరీరం ఉత్సాహంగా ఉంటుంది.

– డాక్టర్. నాగార్జున, ప్రొద్దుటూరు

రోజంతా ఉల్లాసం



రోజూ ఉదయం మిత్రులతో కలిసి వాకింగ్ చేస్తుంటాను. దీని వల్ల రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటుంది. ఉద్యోగ విరమణ చేసి 7 ఏళ్లు అయింది. అప్పటి నుంచి ప్రతిరోజు వాకింగ్ చేస్తున్నాను. దీని వలన షుగర్, బీపీ అదుపులో ఉంది. వాకర్స్ అసోసియేషన్ కూడా ఏర్పాటు చేశారు.

–కె.ఓబుళరెడ్డి, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు, ప్రొద్దుటూరు

రోజూ వాకింగ్ చేస్తా



ప్రతి రోజు ఉదయం వాకింగ్ చేస్తాను. దీని వలన ఆరోగ్యంగా ఉంటున్నాను. మంది మిత్రులు కలసి వాకింగ్ చేస్తున్నాము. వాకింగ్ చేస్తూ అనేక విషయాలను చర్చించుకుంటున్నాము. నడక సాగించడం వలన స్నేహ బంధం బలపడుతుంది. అందరూ కలిసి వాకింగ్ చేస్తూ ఆత్మీయంగా మాట్లాడుకుంటాం. ఆరోగ్యకరమైన జీవితానికి వ్యాయామం, నడక చాలా అవసరం.

– మస్తాన్ వలి, ప్రొద్దుటూరు

వైద్యురాలిని హత్య చేసిన నిందితులను శిక్షించాలి



బద్వేలు అర్బన్ : కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు



ప్రొద్దుటూరు కల్చరల్ : కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పిస్తున్న పాత్రికేయులు

బద్వేలు అర్బన్ : కోల్‌కతాలోని ఆర్‌జీకర్ మెడికల్ కళాశాలలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్, ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. అత్యాచార ఘటనకు నిరసనగా ఆదివారం పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఉద్దేశించి వారు మాట్లాడుతూ వైద్యురాలిపై అత్యాచారం, హత్య జరిగి రోజులు గడుస్తున్నా నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించడంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా వైఫల్యం చెందిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరంతరం సమాజానికి సేవ చేసే వైద్యులకే రక్షణ లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బాలికలు, మహిళలపై జరుగుతున్న దాడులను ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని, అలాగే ఇలాంటి ఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని, సీఐటీయూ పట్టణ కో కన్వీనర్ కొండయ్య, యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్, డీవైఎఫ్ఐ నాయకులు ప్రవీణ్ కుమార్, మస్తాన్‌షరీఫ్, మహిళా కో కన్వీనర్ నాగలక్ష్మి, ఐద్వా నాయకురాలు అనంతమ్మ, మోక్షమ్మ పాల్గొన్నారు.

వైద్యురాలికి ఘన నివాళి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం రాత్రి కోల్‌కతాలో హత్యకు గురైన వైద్యురాలికి నివాళి అర్పించారు. ఆమె చిత్రపటం వద్ద కొవ్వొత్తులు వెలిగించి మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. వైద్యురాలిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని పాత్రికేయులు డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిపై అవగాహన

లింగాల : స్థానిక ప్రభుత్వ సాంఘీక సంక్షేమ ఎస్సీ వసతి గృహంలో ఆదివారం మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య విద్యార్థులకు దోమ కాటువల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్షాకాలం కావడంతో వసతి గృహాలలోని విద్యార్థులు సాయంత్ర 5 గంటలకు కిటికీలు, తలుపులు మేసి ఉంచాలన్నారు. అలాగే పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరాలు వచ్చిన వెంటనే ఆసుపత్రులకు వెళ్లి వైద్యులచే పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త భాస్కర్, వార్డెన్ విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనంతోనే కాలుష్య నివారణ

ఎర్రగుంట్ల : పట్టణంలో కాలుష్యాన్ని నివారించాలంటే పచ్చదనం అవసరమని మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో 320 మొక్కలను నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం పట్టణంలోని డివైడర్ల మధ్యలో ఆయన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రామాంజనేయరెడ్డి, మానవత చైర్మన్ రఘురామిరెడ్డి, పట్టణ సీఐ నరేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్య, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

బస్సులు లేక ప్రయాణికుల అవస్థలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రయాణికులకు తగినట్లుగా బస్సులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. ఆదివారం కడప ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరేందుకు బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. మధ్యాహ్న సమయంలో తిరుపతి, తదితర ప్రాంతాలకు బస్సులు లేకపోవడంతో.. బస్సులు ఎప్పుడు వస్తాయోనని ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. తగిన బస్సులు నడపడంలో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాల్సిన ఆర్టీసీ అధికారుల తీరును పలువురు ప్రయాణికులు తప్పుబట్టారు. ఈ విషయంగా డిపో మేనేజర్ డిల్లీశ్వరరావును సంప్రదించగా ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా బస్సులను నడిపేందుకు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

నేడు వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ట

సింహాద్రిపురం : మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఆదివారం ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట స్థాపన పూజలు నిర్వహించారు. తిరుపతి, బెంగళూరుకు చెందిన వేద పండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీలక్ష్మి హోమం, వాస్తు హోమం, మధ్యాహ్న సమయంలో స్వామివారి విగ్రహ మూర్తుల గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే చెక్కభజనలు ఆకట్టుకున్నాయి.

హిందువులపై దాడులు అరికట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల నాయకులు

బద్వేలు అర్బన్ : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరుతూ ఆదివారం పట్టణంలో ఆర్ఎస్ఎస్, బీజేపీ, ఏబీవీపీ, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, శ్రీరామసేవకులు, హిందూ ధర్మరక్షావేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ బద్వేలు సంఘచాలక్ సి.రామకోటిరాజు, ఖండకార్యవాహ సంజీవరెడ్డి, నగర కార్యవాహ ఈశ్వరయ్య మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో 17 కోట్ల జనాభాలో 8 శాతం మాత్రమే ఉన్న హిందువులపై దాడులు చేయడం హేయమైన చర్య అని అన్నారు. అలాగే హిందువుల ఆలయాలు, ఇళ్లు, వ్యాపార సంస్థలపై దాడులు జరుగుతున్నా స్పందించకపోవడం దారుణమన్నారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా పాలన కొనసాగేలా ప్రపంచ దేశాలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకులు శ్రీనివాసులు, సురేష్‌కుమార్, శివానంద, నరసింహ, ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు, బలిజసేవా సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు సుధాకర్, శ్రీనివాసులు, ఎస్.వెంకటేశ్వర్లు, వీహెచ్‌పీ నాయకులు వెంకటశివనారాయణ, శివకుమార్‌రాజు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న నటుడు చిరంజీవి అభిమాని

ప్రొద్దుటూరు కల్చరల్ : రక్తదానం ప్రాణదానంతో సమానమని బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి డాక్టర్ కె.గోపాల్ అన్నారు. నటుడు చిరంజీవి జన్మదిన వారోత్సవాల సందర్భంగా స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం పద్మభూషణ్ మెగాస్టార్ పవర్ స్టార్ ఫ్రెండ్స్ సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.గోపాల్ మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాలను పురస్కరించుకుని మెగా అభిమానులు రక్తదానం చేయడం అభినందనీయమని కొనియాడారు. రక్తదానం చేసేందుకు యువతను ప్రోత్సహించాలని కోరారు. మెగా అభిమానులు రామారావు, షరీఫ్, చంద్రధర్, హిమామ్, బాబురావు, మధు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవభావంతో మెలగాలి



విశ్వనాథరెడ్డికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీ స్వప్న

పోరుమామిళ్ల: దేవుని సృష్టిలో ప్రతి జీవరాశికి ప్రాధాన్యత ఉందని, విచక్షణ కలిగిన మనుషులు ఉన్నత భావాలతో, ఉన్నత నడవడితో, సాటి మానవుల పట్ల సేవాభావంతో ఉండాలని బ్రహ్మకుమారీ స్వప్న పిలుపునిచ్చారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆదివారం పట్టణములోని ప్రముఖులకు బ్రహ్మకుమారీ ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయానికి స్వప్న రాఖీ కట్టారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ మంచివారికి భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడు ఉంటాయని తెలిపారు. నియోజకవర్గ అదనపు కన్వీనర్ నల్లేరు విశ్వనాథరెడ్డి, ఎస్ఐ కొండారెడ్డి తదితరులకు ఆమె రాఖీ కట్టారు.

● కృష్ణమ్మ బిరబిరా.. రైతన్న కళకళ



పులక చల్లుతున్న రైతులు



నారుకయ్యలో ఎద్దులతో సేద్యం చేస్తున్న రైతు

వర్షించని మేఘాలు వెక్కిరిస్తుంటే.. దిగాలుగా కూర్చున్న రైతన్న నెత్తిన పాలు పోస్తూ.. బీడుగా ఉన్న పొలాలను సస్యశ్యామలం చేసేందుకు కృష్ణమ్మ వడివడిగా అడుగులేస్తూ కేసీ కెనాల్‌లో పరుగులు పెడుతోంది. దీంతో సాగు నీటి సమస్య తీరుతుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. కేసీ కాలువలు నిండుగా పారుతున్నాయి. ఈ ఏడాది సాగుకు ఢోకా లేదని కర్షకుడు ధీమాగా ఉన్నాడు. పొంగి పొర్లుతున్న కృష్ణమ్మను చూసి రైతులు సాగుకు సన్నద్ధమయ్యారు. నారుదొడ్లు సిద్ధం చేసుకుంటూ.. పులక చల్లుకుంటూ.. మడుల్లో ట్రాక్టరుతో దమ్ము చేస్తూ కేసీ ఆయకట్టు రైతులంతా బిజీబిజీగా ఉన్నారు. రాజోలి ఆనకట్ట కింద దాదాపు 94 వేల ఎకరాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

– రాజుపాళెం



కేసీ చాపాడు కాలువలో నిండుకుండలా పారుతున్న నీరు

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



ప్రవచిస్తున్న బ్రహ్మశ్రీ పాణ్యం దత్తశర్మ

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత పొందవచ్చని బ్రహ్మశ్రీ పాణ్యం దత్తశర్మ పేర్కొన్నారు. చిత్తశుద్ధితో భగవంతున్ని ప్రార్థించాలని అన్నారు. స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామిపై ఆయన ఆధ్యాత్మిక ప్రవచనాలను వినిపించారు. ఐదు రోజుల నుంచి నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక ప్రవచనాలు ఆదివారంతో ముగిశాయి. కాగా సోమవారం ఉదయం కార్తీక పౌర్ణమి సందర్భంగా చండీ హోమం నిర్వహిస్తున్నామని, భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి కోరారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక లక్ష్య కార్డియాక్, కంటి ఆస్పత్రిలో ఆదివారం పేద ప్రజలకు నిర్వహించిన ఉచిత కంటి, గుండె జబ్బుల వైద్య శిబిరం విజయవంతమైంది. డాక్టర్ పాతకోట శ్రీనాథరెడ్డి ఉచిత వైద్య శిబిరంలో 48 మంది రోగులను పరీక్షించి, వారిలో 22 మందికి ఉచితంగా ఈసీజీ, 11 మందికి గుండె స్కానింగ్ చేసి రోగులకు చికిత్స అందించి, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనాథరెడ్డి మాట్లాడుతూ ప్రతి నెల మూడో ఆదివారం పేద ప్రజల కోసం ఉచితంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. డాక్టర్ హరిత 35 మంది రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి చికిత్స అందించి సూచనలు చేశారు.


చౌకబారు విమర్శలు మానుకోవాలి




మాట్లాడుతున్న వైఎస్ఆర్‌సీపీ నాయకులు

కమలాపురం : మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డిపై స్థానిక టీడీపీ నాయకులు ఖాదర్‌బాషా తదితరులు చేసే చౌకబారు విమర్శలు మానుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్లు మహ్మద్‌సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి హితవు పలికారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ సీఎం, మాజీ ఎమ్మెల్యేపై స్థానిక టీడీపీ నాయకులు వారిస్థాయి మరిచి విమర్శలు చేయడం హాస్యాస్పదం అన్నారు. కమలాపురం నగర పంచాయతీలో గతంలో ఎన్నడూలేని విధంగా వందల కోట్ల రుపాయల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. వాటి గురించి అవగాహన లేని టీడీపీ నాయకులు అభివృద్ధి జరగలేదని చౌకబారు ప్రకటనలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. టీడీపీ నాయకులు ఈ రెండు నెలల కాలంలో డ్రైనేజ్ పూడిక తీయడం, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమితులైన చిరుద్యోగుల పొట్ట కొట్టడం తప్పా మీరేమి అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో కమలాపురం పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, హాస్పిటల్, పాలిటెక్నిక్ కళాశాల భవనం, ఆర్టీసీ బస్టాండు, సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ సెంటర్లు, మార్కెట్ యార్డులో షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించిన సంగతి మీకు తెలియదా? అని ప్రశ్నించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శనలో చిన్నారులు



గ్రూప్‌డ్యాన్స్‌లో చిన్నారులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని ఉలిమెల్లరోడ్డులో ఉన్న వైఎస్సార్ లేక్ ఫ్రంట్‌లో ఆదివారం సాయంత్రం సండే సందడి కనువిందుచేసింది. విజయవాడ ఎక్సలెంట్ ఇన్స్టిట్యూట్ నాగార్జున పాఠశాల చిన్నారులు మాస్టర్ చిట్టి, చందన ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సందర్శకుల కేరింతలతో ఆ ప్రాంతమంతా సందడి నెలకొంది. సాయంత్రం వేళ పలువురు ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు.

కలెక్టర్ గారూ.. పెట్రోల్ బంక్‌ను ప్రారంభించరా..!

- రెవెన్యూ శాఖ పెట్రోల్ బంక్ నిర్మాణం
- ఆటో స్టాండ్‌గా మారిన పెట్రోల్ బంక్ స్థలం
- అధికారుల బదిలీలతో అయోమయం



ప్రారంభానికి ముందే ఆటో స్టాండ్‌గా మారిన పెట్రోల్ బంక్

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరుతహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో నిర్మించిన పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవాన్ని అధికారులు మరిచిపోయినట్లు ఉన్నారు. గత ఏడాది నిర్మాణం పూర్తయినా ఇంత వరకు ప్రారంభం కాలేదు. సాధారణ ఎన్నికలు, అధికారల బదిలీల ప్రభావంతో పెట్రోల్ బంక్ నిర్మాణం అధికారులకు గుర్తుకు రావడం లేదు. గత కలెక్టర్ విజయరామరాజు ప్రత్యేక దృష్టి సారించి తమ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్‌ను మంజూరు చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద 23 సెంట్ల విస్తీర్ణంలో పెట్రోల్ బంక్‌ను నిర్మించారు. పెట్రోల్ బంక్ నిర్మాణానికి సంబంధించి రెవెన్యూ శాఖ అధికారులు బీపీసీఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. స్థలాన్ని లీజుకు ఇచ్చినందుకు నెలకు రూ.1.20 లక్షలు బాడుగతో పాటు వచ్చే ఆదాయంలో 30 శాతం డిపార్ట్‌మెంట్‌కు ఇచ్చేటట్లు ఒప్పందం కుదుర్చుకున్నారు. గతంలో ఉన్న ఆర్డీఓ శ్రీనివాసులు కలెక్టర్‌తో మాట్లాడి ఈ పనులు వేగంగా చేయించారు. ఈ నిర్మాణం కోసం రోడ్డుపై ఉన్న షాపింగ్ రూములను తొలగించడం, ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారులను ఒప్పించారు. అప్పటి తహసీల్దార్ నజీర్ అహ్మద్ వేగంగా పనులు పూర్తి చేయించారు. గత ఏడాది ఈ నిర్మాణం పూర్తి అయినా ఇంత వరకు పట్టించుకోలేదు. ఇప్పటికైనా రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించి పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తే డిపార్ట్‌మెంట్‌కు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే పెట్రోల్ బంక్ కావడంతో కొత్తగా నిరుద్యోగులకు ఉపాధితో పాటు వినియోగదారులకు నాణ్యమైన పెట్రోల్, డీజల్ లభ్యం కానున్నాయి. పెట్రోల్ బంక్ ప్రారంభించకపోవడంతో ఈ స్థలాన్ని ఆటో స్టాండ్‌గా మార్చారు. నూతన కలెక్టర్ లోతేటి శివశంకర్ పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవంపై దృష్టి సారించాలని ఉద్యోగులు, ప్రజలు కోరుతున్నారు.